అలంకారప్రాయంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు

- బస్‌స్టాప్‌లకు దూరంగా నిర్మించిన బ్రిడ్జీలు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్న వైనం



కొండమడుగు మెట్టు వద్ద నిరుపయోగంగా ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

బీబీనగర్: మండల కేంద్రం నుంచి వెళ్లే జాతీయ రహదారిని దాటేందుకు కొండమడుగు మెట్టు , గూడూరు గ్రామాల వద్ద నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు అలంకారప్రాయంగా మారాయి. బస్‌స్టాప్‌లకు దూరంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలను నిర్మించడంతో ప్రజలు వీటిని వినియోగించడం లేదు. దీంతో ఈ బ్రిడ్జీలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు దూరంగా ఉండడంతో ప్రయాణికులు నేరుగా ప్రధాన చౌరస్తాల వద్ద రోడ్డును దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కొండమడుగు మెట్టు, బీబీనగర్, గూడూరు వద్ద రోడ్డు దాటుతూ అనేకమంది ప్రాణాలు కోల్పోయారు.

ఎస్కలేటర్లు ఏర్పాటు చేసేదేప్పుడో..

ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలను ఎక్కేందుకు వృద్ధులు ఇబ్బందులు పడకుండా బ్రిడ్జీల వద్ద ఎస్కలేటర్లు ఏర్పాటు చేయాలని పులువరు నేషనల్ హైవే అధికారులకు విన్నవించారు. దీంతో కొండమడుగు, బీబీనగర్, గూడూరు వద్ద ఎస్కలేటర్లను ఏర్పాటు చేయాలని కొన్నేళ్ల క్రితమే స్థలాలను పరిశీలించినప్పటికీ నేటికి ఎస్కలేటర్లు ఏర్పాటు చేయలేదు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలను వినియోగించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతున్నాయి. బస్‌స్టాప్‌కు, చౌరస్తాలకు దూరంగా బ్రిడ్జీలు ఉండడంతో రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా.. బిచ్చగాళ్ల అవి నిలయాలుగా.. పార్టీల బ్యానర్లు కట్టుకోవడానికి ఉపయోగ మారుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జీలను సులువుగా ఎక్కి దిగేందుకు ఎస్కలేటర్లు గానీ లిఫ్టులు గానీ ఏర్పాటు చేస్తే బ్రిడ్జీలను ప్రజలు వినియోగిస్తారని పలువురు అభిప్రాయపడుతున్నారు.


ఎస్కలేటర్లు ఏర్పాటు చేయాలి



గూడూరు గ్రామంలోని ప్రధాన సర్కిల్‌కు దూరంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జీని ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని వినియోగించడం లేదు. అదిగాక ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఎక్కి దిగేందుకు వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వస్తుండడంతో ఎవరూ వినియోగించుకోవడం లేదు. ఫుట్ ఓవర్ బ్రిడ్జీ ఎక్కి దిగేందుకు ఎస్కలేటర్లు గానీ లిఫ్టులు గానీ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– బాల ప్రసాద్, గూడూరు

రైల్వే అండర్‌పాస్ పరిశీలన



రైల్వే అండర్‌పాస్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఆలేరురూరల్ : మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అండర్‌పాస్ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో చేసిన పనులు శూన్యమన్నారు. కొద్దిపాటిగా చేపట్టిన పనులు పెండింగ్‌లో పెట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. రైల్వే అండర్‌పాస్ నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఆలేరులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఆలేరు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రజలు సహకరించాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎం.ఎ.ఎజాజ్, వెంకటేశ్వరాజు, కట్టెగొమ్ముల సాగర్‌రెడ్డి, ఎగ్గిడి శ్రీశైలం, ముదిగొండ శ్రీకాంత్, తుంగ కుమార్, లోకేష్, శ్రీకాంత్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లగిరి జంక్షన్ సమస్య పరిష్కరించాలని వినతి

చౌటుప్పల్ : మండల పరిధిలో ఎల్లగిరి జంక్షన్ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ జంక్షన్ వద్ద వెహికిల్ అండర్‌పాస్ బ్రిడ్జి (వీయూపీ), ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయించాలని విన్నవించారు. అండర్‌పాస్ లేకపోవడంతో జంక్షన్ వద్ద అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న ఎల్లగిరి జంక్షన్ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. సమస్యపై హైవే అధికారులతో చర్చిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బాలగోని శివ, గ్రామస్తులు మెట్టు భూపాల్‌రెడ్డి, మేకల దేవేందర్‌రెడ్డి, గుడ్డేటి మల్లేష్, రిక్కల మహేందర్‌రెడ్డి, రిక్కల ప్రవీణ్‌రెడ్డి, కందగట్ల జంగారెడ్డి, గుడ్డేటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

భువనగిరి : బీజేపీ ఓబీసీ మోర్చా పట్టణ నూతన కమిటీని బుధవారం బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కట్కమోజు ఉషాకిరణ్ సమక్షంలో ఎన్నుకున్నారు. పట్టణ ఉపాధ్యక్షుడిగా చీమల మహేష్, రాచమల్ల శ్రీకాంత్, నాగరాజు, ప్రధానకార్యదర్శులుగా కల్లూరి జహంగీర్,సన్నీ, కార్యదర్శులుగా దిడ్డికాడి సంతోష్, సంపత్,శరత్, కోశాధికారిగా శ్రీధర్‌ను నియమించారు.

25న సర్వసభ్య సమావేశం

చౌటుప్పల్ : ఈ నెల 25న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సందీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ సమావేశ మందిరంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా మల్లేశం నియామకం



నియామకపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్

రామన్నపేట : బీజేపీ కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడిగా సుర్వి మల్లేశం నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ బుధవారం జిల్లా కేంద్రంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చెరువు మట్టి తరలింపును అడ్డుకున్న యువకులు

భువనగిరి క్రైం: మండలంలోని పగిడిపల్లిలో అక్రమంగా చెరువు మట్టి తరలిస్తుండగా గ్రామానికి చెందిన పలువురు యువకులు అడ్డుకున్నారు. మట్టిని తోడుతున్న జేసీబీని పట్టుకుని ఆర్‌ఐ శ్రీనివాస్ రెడ్డికి అప్పగించారు. అనంతరం యువజన కాంగ్రెస్ నాయకులు నోముల తరుణ్‌తో కలిసి ఇరిగేషన్ కార్యాలయంలో ఏఈ భరత్ కి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పడిగం సంతోష్, జుర్రు మహేష్, భాస్కర్, నరేష్, నరసింగరావు, సాయి, నాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

అన్నెపర్తి ప్రవీణ్‌కు న్యాయం చేయాలని ధర్నా



సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

గుండాల : విద్యుదాఘాతంతో గాయలపాలైన మండల కేంద్రానికి చెందిన అన్నెపర్తి ప్రవీణ్‌కు న్యా యం చేయాలని కోరుతూ ప్రవీణ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బుధవారం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు ప్రవీణ్‌ను విద్యుత్ స్తంభం ఎక్కించి సరి చేస్తుండగా తీగలు తగిలి గాయాలపాలయ్యాడన్నారు. అతడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏడీ బా లునాయక్ బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కా ర్యక్రమంలో మద్దెపురం రాజు, ఖలీల్, ఎ.భాస్కర్, ఎ.రాములు, నర్సింహ, గిరి, మల్లయ్య, నర్సయ్య, లింగయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పండ్లు, గుడ్లు పంపిణీ

వలిగొండ : మండలకేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న వేసవి కాల శిక్షణ తరగతుల్లో పాల్గొనే క్రీడాకారులకు మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొటం రమేష్ సహకారంతో బుధవారం పండ్లు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బచ్చు శ్రీనివాస్, ఉప్పునూతల సత్యం, పోలేపాక బిక్షపతి, వంగర రమేష్, మైసోల్ల శ్రీకాంత్, ఎడవెల్లి అనిల్, రాజేష్, జంగయ్య, సాయికుమార్, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు .

విద్యార్థిని వేధిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కేసు

చౌటుప్పల్: విద్యార్థులను వేధిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాలోని మామునూరు గ్రామానికి చెందిన కర్నాటాకు అనిల్‌కుమార్(39) చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామంలోని నేతాజీ ఫార్మసీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 2012 నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అదే కళాశాలకు చెందిన బీఫార్మసీ మొదటి సంవత్సరానికి చెందిన ఓ విద్యార్థిని (20)కి 2023లో మెసేజ్ చేశాడు. దానికి ఆ విద్యార్థిని స్పందించలేదు. అయినప్పటికీ ఈ నెల 19నుంచి 21వ తేదీ వరకు అసభ్య పద జాలంతో సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు పంపించాడు. దీంతో విద్యార్థి బుధవారం రాత్రి చౌటుప్పల్‌లోని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న సీఐ అశోక్‌రెడ్డి విచారణ ప్రారంభించారు. నిందితుడైన అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చౌటుప్పల్ : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1983–84బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకా ల ను గుర్తు చేసుకున్నా రు. విద్యాబుద్ధులు నేర్పిన గు రువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎండీ. ఇస్మాయిల్, వీరమళ్ల శ్రీమన్నారాయణ, కొయ్యడ స్వామిగౌడ్, మునగాల తిరుపతిరెడ్డి, ఊడుగు వెంకటేశం, పోలోజు భాస్కర్‌చారి, పాశం రఘుపతి, గోశిక రవీందర్, ఎస్‌కె.జానిపాష, ఊడుగు అశోక్, బొబ్బిళ్ల ధనేష్, ఉస్మాన్, ముజీబ్, జగదీష్, ఇస్మాయిల్, నోముల సత్తిరెడ్డి, జయమ్మ, మహాలక్ష్మి, మేనమ్మ, పద్మ, పద్మజ, సంధ్యారాణి, జ్యోతి, శోభారాణి పలువురు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన



బూర్గుపల్లిలో భర్త ఇంటిముందు నిరసన తెలుపుతున్న భార్య భాను

రాజాపేట: వివాహం చేసుకుని కాపురం చేయడానికి నిరాకరించిన భర్త ఇంటిమందు భార్య బుధవారం నిరసన తెలిపింది. ఈ సంఘటన రాజాపేట మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గుపల్లి గ్రామానికి చెందిన రేకులపల్లి పద్మారెడ్డి, సక్కూబాయి దంపతుల కుమారుడు మహిపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పనిచేస్తుండగా.. అదే ఆఫీస్‌లో పనిచేస్తున్న భాను అనే యువతితో పరిచయం ఏర్పడింది. 2021 జనవరి 2న భానును సింహాచలం తీసుకెళ్లి మహిపాల్‌రెడ్డి వివాహం చేసుకున్నాడు. ఈ విషయం భాను కుటుంబ సభ్యులకు తెలియడంతో వారి అంగీకారంతో తిరిగి ఆమెను మహిపాల్‌రెడ్డి వివాహం చేసుకున్నాడు. పెళ్లి చేసుకున్న నాటి నుంచి తాను నపుంసకుడినని, సంసారం చేయనని మహిపాల్ రెడ్డి చెబుతున్నాడని బాధితురాలు ఆరోపించింది. పిల్లలను తెచ్చుకుని పెంచుకుందామని మహిపాల్ రెడ్డికి నచ్చజెప్పినా వినకపోవడంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ భాను భర్త ఇంటి ముందు వంటావార్పుతో నిరసన తెలిపింది. అంతే కాకుండా తన వద్ద ఉన్న రూ.70లక్షలు, 22 తులాల బంగారం, ఒక ప్లాట్ కూడా మహిపాల్‌రెడ్డి తీసుకున్నాడని, తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేదని బాధితురాలు వాపోయింది. ఈ విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. బాధితురాలికి ఉమెన్ రైట్స్ నాయకురాలు మాచర్ల ప్రతిభతో పాటు పలువురు, గ్రామస్తులు అండగా నిలిచారు.

కార్మిక హక్కుల సాధనే 1104 యూనియన్ ధ్యేయం



యూనియన్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రామన్నపేట : కార్మిక హక్కుల సాధనే 1104 యూనియన్ ధ్యేయమని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి, అమర్నాథ్ అన్నా రు. బుధవారం రామన్నపేట సబ్‌స్టేషన్ ఎదుట మేడే వేడుకలను నిర్వహించారు. యూనియన్ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలోనూ యూనియన్ సభ్యులు ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లె రమేష్, సోమేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అశోక్, యాదయ్య, తిరుమలయ్య, శ్రీధర్, రమేష్‌రెడ్డి, షకీల్‌బేగ్, మల్లయ్య, వేణు, రాములు, జాకీర్‌హుస్సేన్, మదార్, క్రిష్ణ, శ్రీను, ప్రభాకర్, సురేష్, నర్సింహ, మహేష్, సైదులు, గోపాలు, రవిందర్, సత్యనారాయణ స్వామి, వెంకన్న, హరిబాబు, యాదయ్య, దేవేందర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలు రుజువు చేస్తే రాజీనామా చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల అశోక్‌రెడ్డి

మోత్కూరు : తనపై చేస్తున్న అవినీతి ఆరోపణలను రుజువు చేస్తే రాజీనామ చేస్తానని మో త్కూరు సింగిల్‌విండో చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం బుధవారం మో త్కూరు సింగిల్‌విండోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగిల్‌విండో కార్యాలయంలో చైర్మన్ స్థాయిలో తాను ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడ లేదన్నారు. తనను చైర్మన్ పదవి నుండి దింపడం కోసమే అధికార పార్టీ నాయకులు డైరెక్టర్లను ప్రలోభ పెట్టి అవిశ్వాస తీర్మానం కాపీని, అవినీతి ఆరోపణలు చేస్తూ జిల్లా అధికారికి అందజేశారన్నారు. ఈ సమావేశంలో సింగిల్‌విండో డైరెక్టర్లు సామ పద్మారెడ్డి, పురుగుల మల్లయ్య, దేవసరి రాములు పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తడక వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని టూరిజం పార్కులో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల కోసం కాంగ్రెస్‌ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, కిసాన్‌సెల్‌జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, తడక రమేశ్, తడక యాదగిరి, కౌన్సిలర్లు భోగ భానుమతివిష్ణు, మోటె రజిత రాజు, కుడికాల సృజన, సీత సుధాకర్, కొయ్యడ శ్రీను, కుక్క కుమార్, అంజమ్మ, కీర్తి సంజీవ, చెన్నబత్తిని యాదగిరి, కుక్క స్వామి, సూరెపల్లి శ్రీనివాస్, సుధీర్, నల్ల నాగేశ్, ఎడ్ల లింగస్వామి, ఉప్పలయ్య, గుండ్ల రమేశ్, వేముల ఆనంద్, మహేశ్, రుద్ర చందు, నరేందర్, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, శ్రీకాంత్, సందీప్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్యామ్‌సుందర్

తుర్కపల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మండల స్పెషల్ ఆఫీసర్ జినుకల శ్యాంసుందర్ అన్నారు. బుధవారం మండలంలోని మాధాపూర్, బద్దూతండా, మల్కాపూర్, కేసీయాతండా, తుర్కపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పా ఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చి దిద్దనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో మంచినీటి వసతులు, మైనర్ రిపేర్, బాల బాలికలకు మూత్ర శాలలు రిపేర్ చేయడం, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఇట్టి పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టడం జరుగుతుందన్నారు. పనులు నాణ్యతతో జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పనులకు సంబంధించిన ప్రగతి నివేదిక ప్రతి రోజు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి అందజేయాల ని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, ఏఈ అమరేందర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

దొడ్డు రకం వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న చెక్క వెంకటేష్

ఆలేరురూరల్ : దొడ్డు రకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొర్రిలు లేకుండా విక్రయాలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కనకయ్య, పెద్ద ఆంజనేయులు, పరుశరాములు, శ్రీనివాస్, బొడ్డు ఆంజనేయులు, స్వామి, నర్సయ్య పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తిచేయాలి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి

రామన్నపేట : రామన్నపేటలో జరుగుతున్న రోడ్డు విస్తరణ అనుబంధ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం రామన్నపేటలో రూ. 8.50కోట్లతో జరుగుతున్న రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. వర్షపునీరు సాఫీగా పోవడానికి అవసరమైన అన్ని జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడొద్దని ఆదేశించారు. ఆస్పత్రి నుంచి వరద, మురుగునీరు పెద్దమోరీలో కలిసే విధంగా డ్రెయినేజీ పొడగించాలన్నారు. ఆయనవెంట డీఈ వాజీదా షహనాజ్ కాంట్రాక్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

గుండాల : మండలంలోని వెల్మజాల గ్రామంలో శివాలయ నిర్మాణానికి తుర్కలశాపురం గ్రామానికి చెందిన ఉప్పల రాము యాదవ్ బుధవారం రూ.51 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాచ ప్రసాద్, సంగి భాస్కర్, సంగి బాలకృష్ణ, నర్సింహ రెడ్డి, అనంతుల రామచంద్రయ్య, సంగి వేణుగోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

మోత్కూరు : ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అన్నారం సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని యూనియన్ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు వెంటనే చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సోమేశ్వర్, సుబ్రహ్మణ్యశర్మ, దడిపల్లి శ్రీనివాస్, వెంకన్న, మల్లేషం పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత

వలిగొండ : మండలంలోని అరూరు గ్రామంలో ఈ నెల 23, 24వ తేదీల్లో జరుగనున్న గ్రామదేవతల వార్షిక ఉత్సవాలకు, శ్రీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ బుధవారం పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిట్టెడి జనార్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మల శ్రీనివాస్, బండారు నరసింహారెడ్డి, పోలేపాక చెమ్మయ్య, బైకాని ముత్యాలు, గౌడ సంఘం అధ్యక్షుడు కల్లెం బాల శంకర్, ఆవుల సత్యనారాయణ, జక్కిడి నర్సిరెడ్డి, బండి రవికుమార్, ఎలిమినేటి సంతోష్ కుమార్, తుమ్మల కరుణాకర్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



తాళిబొట్టు చూపిస్తున్న వేద పండితులు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నృసింహ జయంతి సందర్భంగా బుధవారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా 108 కలశాలతో పంచామృతాలతో ,సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, లక్ష పుష్పార్చన పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం భూ సమేత శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి మోహన బాబు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వలిగొండ. : మండలంలోని పహిల్వాన్‌పురం గ్రామానికి బొడ్డుపల్లి నర్సింహ ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి అదే ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి బుధవారం రూ. 25 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి అన్నివిధాల ఆదుకుంటామన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గజ్జెల్లి అశోక్ ఇటీవల మృతిచెందాడు. అశోక్ స్నేహితులు బుధవారం రూ.10వేల రూపాయల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్ రెడ్డి, వెంకటేష్, ప్రభాకర్ సురేందర్,రవి, రంజిత్ కుమార్, సత్యానారయణ, ప్రభాకర్ రెడ్డి, పాండు పలువురు స్నేహితులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న స్నేహితులు

పోలింగ్ బూత్‌ల పరిశీలన

భూదాన్‌పోచంపల్లి : ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టణ కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను బుధవారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి సందర్శించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు.

1966 మంది ఓటర్లు..

పోచంపల్లి మండల వ్యాప్తంగా మొత్తం 1966 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పోచంపల్లిలో 818, ముక్తాపూర్ 75, రేవనపల్లిలో 48 , పిలాయిపల్లిలో 81, జగత్‌పల్లిలో 21, పెద్దగూడెంలో 58, దేశ్‌ముఖిలో 46, సాయినగర్‌లో 11, హైదర్‌పూర్‌లో 12, జలాల్‌పురంలో 42, మెహర్‌నగర్‌లో 25, భీమనపల్లిలో 52, కనుముకులలో 32, దంతూర్‌లో 43, జిబ్లక్‌పల్లిలో 46, దోతిగూడెంలో 43, అంతమ్మగూడెంలో 27, పెద్దరావులపల్లిలో 45, ధర్మారెడ్డిపల్లిలో 22, వంకమామిడిలో 52, రాంలింగంపల్లిలో 13, గౌస్‌కొండలో 24, జూ లూరులో 158, ఇంద్రియాలలో 73, శివారెడ్డిగూడెంలో 52, కప్రాయిపల్లిలో 47 మంది ఓటర్లు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు చేస్తున్నాం

ఆత్మకూరు(ఎం): ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 401, 402 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 1565 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయన్నారు. మండలంలో ఇప్పటికే ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం చేశామన్నారు. ఆయన వెంట డీటీ షఫీయోద్దీన్, సీనియర్ అసిస్టెంట్ పాండు, ఆర్‌ఐ వై. మల్లిఖాకార్జున రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

తుర్కపల్లి: మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో గల వేంకటగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం పురుహితులు వెన్నకూచి రమాకాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవత మూర్తులకు అష్టోత్తర కలశాభిషేకం, పంచామృతాహిషేకం, అనంతరం వేద మంత్రోచరణలతో సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వేద బ్రాహ్మణులు ఆత్రేయ శర్మ, కిరణ్‌కుమార్ శర్మ, శ్రీపాద శర్మ, సాయిరామ శర్మ, రామానంద శర్మ, రాఘవచారి, తాజా మాజీ స ర్పంచ్ ప్రభాకర‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీ ని వాస్‌రెడ్డి, రాజుకుమార్, రవి, భిక్షపతి, నరేశ్, న ర్సింహులు, నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భువనగిరి క్రైం : రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని పెద్ద చెరువు దగ్గర బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గంగదేవి శ్రీనివాస్, అతని కూతురు అనుశ్రీ లు మోటార్ సైకిల్ వాహనంపై హైదరాబాద్ కి బయల్దేరారు. ఈ క్రమంలో పట్టణ పరిధిలోని చెరువు కట్ట సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో మోటార్ సైకిల్ పై ఉన్న శ్రీనివాస్, అనుశ్రీలు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ కె.అరుణ్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ కంట్రోలర్ వంగాల నాగులు మృతి



వంగాల నాగులు (ఫైల్)

మోత్కూరు : మండలంలోని పాడిచేడు గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచి రిటైర్డ్ కంట్రోలర్ డాక్టర్ వంగాల నాగులు (85) మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలను గురువారం ఉదయం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ద్వారకాపురి విద్యుత్ నగర్ కాలనీ రోడ్డు నెం.80లోని వివేకానంద శ్మశాన వాటికలో నిర్వహించనున్నట్లు మృతుడి సోదరుడు వంగాల సత్యనారాయణ బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు.